# రకంవోరి మడుసులు

'ఈ యుద్ధం వచ్చినాక ఐదు సంవచ్చరాల్లో ఐమురకాల వాగనా లెక్కాడురా, సంకురుమయ్యా!' అన్నాడు కుక్, లమ్డీక లచ్చన్న - భోజనం, కూర అన్నీ డైనింగాలులో పెట్టాడు.

డైవ్రివర్లు రావడం ఇంకా ఓ గంట టైముంది. బాతాఖానీ చేస్తుండాం నేనూ లమ్డికగాడూ.

కొయామామీద బాంబులడ్డప్పుడు మర్నాడు లచ్చన్న "యం. ఐ. రూమ్" పోయాడు. "ఏమిటీ నీకు!" అని డాక్టేరు అడిగాడు.

"గుండెల్లో ఏంటో మాట్టాడుతుంది సార్ ! నాకు దయ్యం పట్టిం దనుకుంటాను సార్" అన్నాడు లచ్చన్న.

'గుండెల్లో మాట్టాటం ఏంటిరా నాన్సెన్సు' అంటూ, అయినా సూద్దాం అనుకున్నోడు గామోసు డాక్టేరు. ఆడి గుండెమీద రబ్బరుగొట్టం పెట్టి కాస్సేపు ఇన్నాడు.

"ఏంలేదు జాగ్రత్త! మళ్ళొచ్చావా 'షాక్ ట్రిల్లు' ఇస్తాను" అన్నాడు డాక్టేరు.

'ఒట్టుసార్, గుండెల్లో మాట్టాడుతుంది సార్' అన్నాడు లచ్చన్న.

"ఆల్ రైట్. ఏం మాట్టాడుతుంది నువ్వే చెప్పు!"

"లష్మీక ! లష్మీక ! అంటుంది సార్—ఇనండిసార్ ! అదుగోసార్; లష్మీక లష్మీక అంటుందిసార్! నిన్న సాయింతరంనుంచీ ఇంతే సార్ !"

ఆడిమొగం ఎగాదిగా సూశాడు రెండు సార్లు డాక్టేరు. పక్కున నవ్వాడు. రెండవుస్సులు నీలంగా ఏందో ఇచ్చాడు. ఈ యవారం కంపెనీలో తెలిసింది. లచ్చన్న కాస్తా లష్మీక లచ్చన్న అయినాడు.

"సంకురుమయ్య ఎక్కన వాగనాలేందిరా" అన్నాను.

"మొదటివాగనం పంచదారబత్తా; రెండో వాగనం కిరసనాయిలు డబ్బా; మూడోది నిప్పుల్లలపెట్టె; నాల్గోది కట్టెలమోపు; అయిదోది ఎండి రూపాయి" అన్నాడు. కరండితో పులుసు తిరగేశాడు.

మా ఊర్లో అవుదాన్లగారికి గూడా ఇంతతెలివి తేటలున్నాయా అనుకున్నాను.

"మళ్ళీ మాట్లాడితే ఉంకోవాగనం గూడా సెపుతా !"

"ఏంటిరా అదీ !"

"గది_స్తలం: సెప్పడాని కది వాగనం అల్లే లేదు గందా అని సెప్పలే."

"సిపాయిలం, మనకు గది_స్తలం సంగతెందుకురా?"

"మన సంగతి గాదురా ? గదికి పద్దాలుగుమందిం, ఏ బ్యారక్‌లో ఉన్నా ఉండగలం. పాపం జమేదారుసాబ్ సంగతి చూడు. ఆయన గారికి గురకెట్టేవోడుంటే నిద్దరే పట్టదు. అదేం పాపఖర్మమో ఆయన రూములో ఎప్పుడూ గురకెట్టేవోడే వ_త్తాడు. "ఆపీసరు గందా ఒక్కొక్కడి కొక్కొక్కరూము ఇవ్వగూడదా?"

"జమేదారంటే ఏం ఆఫీసరురా. అందులో నల్లరంగు గాదంటరా ! ఆ ఆఫీసర్లలో గూడా కింగు కమీసన్ యేరు, వై సురాయి కమీషన్ యేరు. తొత్తూ బడితొత్తూ సామిత ఇనలేదంటూరా?"

"పాపం !"

"ఆయనకు లంక పొగాకు సుట్టలు పతినెలా వ_త్తయి.రాంగానే నన్ను పిలిచి ఓ డజను ఇ_త్తాడు. మఖా దొడ్డ మనిసిలే ! ఆయనకూ నాకు బలే స్నేగం. గదుల్లో రెండో మనిసి ఉంటే ఏమో బాదక సాదకాలో సెపుతూ ఓరోజు ఆయనకు తెలిసిన మనస్సుల రకాలన్నీ వొర్నించాడు. మఖా గ్యానం గలోడు—కొంచెం కోపధారోడుగాని!"

"ఆయన సెప్పిన కతంతా సెప్పరా?"

"నాలుగేండ్ల నుంచీ అనుబవం సెపుతున్నా ఇనరా లచ్చిగా! గదివంత గాడ్ని ఎవడ్నైనా తీసుకురా ఆడిమొగం సూడగానే ఆడెటువంటి వాడైందీ సెపుతా !" అనేవోడు జమేదారు సాబు.

ఒకరకం మనిసిని సెపుతాను సూడు. వాడ్ని డ్రెస్సు జాగర్తగా డందాం.

సీ(డెన్సు జా(గత్త గాడు రాతిర్లు అట్టే ఇబ్బంది పెట్టడు. అడి దర్జా అంతా పగటిపూట. అడి మారణమైన పనంతా పొద్దున్నే ఏడు గంటలకు: పుట్టి మునిగినట్టుగా పక్కమీదనుంచి దుడీల్నా లేత్తాడు. అద్దంలో ఆవలిస్తూ అయిదు నిముసాలు చూత్తాడు. అడిమొగం తగలెయ్య. అడదానికన్నా అదమత్తం. గడ్డం గీద్దామా వద్దా అని ఊగులాడ్తాడు. పుట్టెం(ట్రుకలు తీసేప్పుడు పిల్లోడికెంతో అంత భయం — ఈడికి గడ్డం గీకడమంటే! అందులో అది గడ్డమంటే గడ్డమా — తుప్పట్టిన పాత కొబ్బరి తురుము జల్లెడ!

ఆ కత్తినూరడం, దాన్ని ఇరికించడం, కాగితంమీద అంటించడం, పొద్దున్నే ముగూర్తం పెండ్లిలోగూడా అంత అడావిడుండదు. అడట్టా గిజగిజ లాడుతుంటే నీకు నిద్దరెట్టా పడుతుంది? స్టరాపంట స్టరాపు! దాని మీదేసి రుద్దుతుంటే స్టేనుగన్‌తో తాషామర్పాలాడినట్టు, ఒళ్ళంతా గొంగళి పురుగు పాకినట్టు, మళ్ళీ నిద్ద(రాదు.

గీకడమైంతర్వాత పల్లుతోమడం. తంబళాయన కల్వంలో మందులు నూరినట్టు అదంతా అయింతర్వాత "సోరీ! సోరీ! నా పనంతా అయిందోయి. నువ్వులేవ్వచ్చు." అంటాడు. నేను లేచి దూలాలు చూత్తున్నది గెంటనుంచీ !

రెండోరకం గది వంతగాడు "మఖామంచోడు." పదకొండింటిదాకా దోస్తుల్తో దర్జాలు చేత్తాడు, బైట అక్కడక్కడ. అద్దరా(తొత్తాడు. స్టవు ఎలిగిత్తాడు. బుడ్డి ముందెడతాడు. ఆమ్లెట్టు తయారంటాడు. అడి 'ఆడర్లీ' మూలుగుతూ స్టవుముందర కూకుంటాడు. అడితో వొచ్చిన దోస్తులు నిన్ను పలకరిత్తారు. తలదగ్గిర ఓడు కూకుంటాడు. కాళ్ళదగ్గిర ఓడు కూకుంటాడు. కొంచెం ఎరిగినాడైతే "ఇంటోంచి ఉత్తరాలొత్తున్నయిరా?" అని పలకరిత్తాడు. అక్కడికొచ్చింది ఆమ్లెట్టుకూ కాదు బుడ్డికీ

గాదు: నా చామసమాచారాలు ఇచారించడానికే అన్నట్టు మొగం పెడతాడు. మహామంచోడి కీదంతా చుట్టరికంచూపల్లే వుంటుంది. ఆడికి తెలుసు నువ్వేమీ అనవని! ఆడి సిగరెట్ల యిపోతే నీ సిగరెట్లుతీసి దోస్తులకిత్తా డు. ఆడి తువాలా సాలకపోతే నీ తువాలా ఆళ్ళకిత్తాడు. అద్దరాతిరి ఆములెట్టేం దిరా, ఆడి పిండాకూడు?

ఈ మాటంటూ ఆ సంగతి ఓ నిముసం ఆపి "ఒరే లచ్చిగా యీమారు యారైనా "చుట్టీ"లో ఎత్తే ఆవకాయ తెమ్మన్రా!" అనేవోడు జమేదారు సాబ్. ఆయనకు ఆమ్లెట్టన్నప్పుడు ఆవకాయ గ్యాపకం వచ్చేది గామోసు!

మళ్ళీ మొదలెట్టి "అన్నిరకాలకన్నా పీదరకం 'నిదానంగాడు.' ఈడు ఏంచేసినా నెమ్మదిగా సేత్తా డు. ఆడ్ని సూతంగానే సెప్పొచ్చు. ఆడు నీకు గది వొంతగాడైనాడా చెనిమగర్దశ వొచ్చిందనుకోవచ్చు.

చాదారణంగా ఆడిచేతుల్లో ఏదో ఓ పుత్తకం ఉంటుంది. అంటే ఆడు గది వొదిలెట్టి ఎళ్ళడన్నమాట. ఓ నిముసం ఎళ్ళినా ఎంటనే వత్తా డు. ఆడు గదిలోఉంటే ఓటలాయన గల్లాపెట్టె దగ్గిరున్నట్టే. నీ గదికేం బయ్యం లేదు. ఈ రకమోడు చాదారణంగా చిగరెట్లు తాగడు. నువ్వు తాగుతుంటే "ఆ పొగ నాకు పడదురా — బైటికి పోరాదురా!" అంటాడు. బ్లడీఫూల్! ఎన్నిసార్లు బైటికెళ్తాం ఏంరా. ఆడు ముఖ్యంగా సేసేది ఇంటికి ఉత్తరాలు రాయడం. పొద్దత్తమానం ఉత్తరాలే! గదిలోఉన్న ఒక్క కుర్చీ ఒక్కబల్లా ఆడికే. ఊరికే ఉత్తరం రాత్తా డా! ఉహూ! మద్దె మద్దె ఓ పొటో చూత్తాడు. ఆడి పెళ్ళాంది! ఊరికే చూత్తా డా? ఉహూ! లటక్కునా నీదగ్గరకొత్తాడు. మీదచెయ్యేత్తా డు. "చూడ్రా నా పెళ్ళాం పొటో! దరిద్రం మిలిటరీ. ఇక్క డున్నాను!" అంటాడు. ఆడిపెళ్ళాం పొటోచూత్తే నాకేం కుతి తీరుతుందిరా బ్లడీఫూల్!

"నువు సెప్పరా లచ్చన్నా! ఆడిపెళ్ళాం పొటో సూత్తే నాకెట్టా కుతి తీరుతుందిరా" అనేవోడు జమేదారుసాబు.

"ఛుట్టీలో ఇద్దరూ ఒక్కసారిగా ఇంటికెళ్ళండిసాబ్! అప్పుడాయన పెళ్ళాన్నే సూడొచ్చు మీరు !" అనేవోడ్ని నేను.

ఆడి ఉత్తరాల కంతుందా? ఉహూ! పోనీ ఆడింతటాడు రాత్తాడా? ఉహూ! ఒకసారి లేత్తాడు. నెత్తిగోక్కుంటాడు. ఒకసారి లేత్తాడు. చూరు చూత్తాడు. ఆడిమొగం అప్పుడు కడుపులో నెప్పొచ్చినాడల్లే వుంటుంది? మళ్ళీ కూకుంటాడు. కలంతో బల్లమీద వాయింతాడు. కాలఊల్లాడింతాడు—వాతంవొచ్చినోడల్లే! దటాల్న ఓ కాగితం చింపేత్తాడు. మళ్ళీ మొదలెడ్తాడు. ఆగుతాడు: ట్రంకుతీసి అందులో ఓ చిన్న పెట్టెలోంచి నాల్గు బిస్కెట్లుతీసి బల్లమీద పెట్టుకుని తింటూ మళ్ళీ ఆలోచిత్తాడు. నువు పక్కన పపంచంలో ఉన్నావో లేవో ఆడికి తెలీనే తెలీదు. ఈ పిచ్చి యవారాలన్నీ సూసి నీకు పిచ్చెత్తుతుంది. అడ్నుంచి పరుగెత్తిపోతావ్—ఏ రండీ బజారుకో!

"ఆడికన్నా గమత్తురకం"అంతా నాన్సెన్స్‌గాడు."ఈ వేడి నాన్సెన్సు" అంటాడు. "ఈ వాన నాన్సెన్సు" అంటాడు. ఆడు సెప్పిందానికల్లా నువు ఊకొట్టాలి. "ఈఊరినీళ్ళు దరిద్రం" అంటాడు. సూడు "నా చర్మం అంతా ఎట్టా అయిందో" అని లాగు విప్పుతాడు. నువు సూడాలి. "అరెరే!" అనాలి!

"నిద్రకేకలగాడు" నీకు గదివింతగా డైనాడా సచ్చావే!

ఈడి మజాగూడా పగులుగాదు. రాతిరిపూట! మేలుకొనిగాదు నిదర్లో. ఆడు నోరు నెమరుత్తుంటే మీద చుంచెలుకలు పాకినట్టుంటుంది.మూడు దేముళ్ళకూ మూడొందలసార్లు మొక్కున్న తర్వాత నిద్రట్టిందనుకో నీకు. నిద్ర పోగలవా? ఉహూ! అద్దరాతిరి అరుపు లినబడతై. ఆడియే! బురదగుంటలో

పంది నిద్రోయినట్టు నిద్రోతాడు. అరుపులు మాత్రం అరుత్తాడు. ఆ అరుపులుగూడా అనేకరకాలు. "తంతా గాడిదా!" అంటాడు ఓసారి. "పులుసులో ఇంగువే లేదు యదవా" అంటూ నాలుక చప్పరిత్తాడు. "బాగున్నా? ఎన్నాళ్ళైందే నిన్నుచూసి" మంచం వొత్తుకుంటాడు. ఒక్కొక్కసారి మంచం మీంచి కిందపడతాడు. పొద్దున్నే "ఏందిరా రాత్రట్టా చంపావు!" అంటే "ఛా!" అంటాడు.

"ఆడిసంసారం ఆడినెత్తినగాడు" అందరికన్నా అర్ధానంగాడు. ఆడు గదిలో ఉన్నాతా గది గదిగా ఉండదు. కిటికీలకు గుడ్డల్తగిలిత్తాడు. బల్లమీద ఆడి సెంటుబాటిల్లేనా, దువ్వెనలేనా అయ్యేనా పడేత్తాడు. నీ వస్తువులు ఏవైనా పెట్టడానికి తలం ఉండదు. నువ్వట్టాపోయి ఇట్టా వచ్చేప్పటికి నీ మంచం అట్నుంచి ఇటొత్తుంది. నువ్వూ నీ మంచమేగాని మిగతా గదంతా ఆడికే! ఆ గదిలో గోడలన్నీ ఖరాబుచేత్తాడు. పేపర్లోంచి కత్తిరించిన ఆడాళ్ళ పోటోలన్నీ ఆ గోడలమీనే! ఆడి కాష్టంమీద యీ పోటోలు లేకపోతే ఆడి శవం దీపావళ్లో నరకాసురుడల్లే నిటారుగా నుంచుంటుంది!

"ఇంకా ఇంకా ఎన్నెన్నిరకాల మడుసులో ఉన్నార్రా లచ్చిగా" అనేవోడు జమేదారు సాబు.

"మిలటరీ వొదిలి ఇంటికెళ్ళేనామటుక్కు నేను వొంటరిగా ఉంటాన్రా! దేముడు రచ్చిత్తే, ఇంటికాడ ఒంటరిగానే జీవిత్తాన్రా! నీగ్గూడా అదే సలహా! ఏన్రోవ్?" అనేవోడు ఆయన!

నేననేవోడ్ని: "నాకు సంసారం ఉందిసార్! మొన్న ఇంటి కెళ్ళొచ్చింతర్వాత గర్భిణీగూడా సార్!"

"బ్లడీపూల్!" అనేవోడు ఆయన. ఆయన అక్కలింత బమ్మచారేమో.